మీకు తెలుసా?

**ఆశా కార్యకర్తల వేతనం**

బీజేపీ పాలిత మధ్యప్రదేశ్‌లో...
రూ.2,000
30 జూలై, 2023 నుంచి
రూ.6,000

తెలంగాణ రాష్ట్రంలో...
కేసీఆర్ ప్రభుత్వం రాక ముందు
రూ.1,500
ఇప్పుడు కేసీఆర్ ప్రభుత్వం ఇస్తున్నది
రూ.9,750



■ యార్కర్



## బస్సుయాత్ర తుస్సు!

ఓటరు: ఏం చేస్తున్నారు?
రాహుల్: బస్సుయాత్ర
ఓటరు: ఎవరెవరు చేస్తున్నారు..
రాహుల్: నేను.. మా చెల్లె.. (రాహుల్‌గాంధీ, ప్రియాంకా గాంధీ)
ఓటరు: తెలంగాణ ప్రజలకు ఏం చెప్తున్నారు?
రాహుల్: వారసత్వ, కుటుంబ రాజకీయాలను అంతం చేస్తామని శపథం చేస్తున్నాం.
ఓటరు: అవును ఈ దేశానికి తొలి ప్రధాని నెహ్రూ మీకేమవుతారు?
రాహుల్: ముత్తాత (నానమ్మ తండ్రి)
ఓటరు: అట్లనా! మరి దేశానికి మూడో ప్రధానమంత్రి ఎవరు?
రాహుల్: మా నాయనమ్మ ఇందిరాగాంధీ
ఓటరు: ఓహో! మరి దేశ ఆరో ప్రధాని?
రాహుల్: ఇంకెవరు మా నాయన రాజీవ్
ఓటరు: మొన్నటికి మొన్న యూపీఏ సర్కార్‌ను పదేండ్లు వెనకుండి నడిపింది ఎవరు?
రాహుల్: మా అమ్మ సోనియాగాంధీ
ఓటరు: ఇప్పుడు చెప్పండి తెలంగాణ ప్రజలకు మీరేం సందేశం ఇస్తున్నారు?
రాహుల్: కుటుంబ, వారసత్వ రాజకీయాల నుంచి విముక్తి కల్పిస్తామని..
ఓటరు: తెలంగాణ ప్రజలు అంత ఎడ్డోళ్లలా కనిపిస్తున్నారా? ఇన్నేండ్లూ కేంద్రంలో, రాష్ట్రంలో అధికారంలో ఉండి ఏమీ చేయని సన్నాసులు వచ్చి.. మాకు మంచి చేస్తున్న కేసీఆర్‌ను నిందిస్తే... ఎట్ల నమ్ముతం అనుకున్నవ్ పప్పూ!!

*-రాజు అతికం*




## డీపీ మారిందా.. గోడ దూకినట్టే!

ఎలక్షన్ల టైంల లీడర్లు పార్టీలు మారుడు కామన్. దేశమంతా జరుగుతున్న తంతు ఇది. మాకు టికెట్ ఇవ్వలేదని కొందరు, మాకు పడనోళ్లకు టికెట్ ఇచ్చిండ్రని ఇంకొందరు రాత్రికి రాత్రే పార్టీలు మారుస్తుంటరు. ఏ లీడర్ ఏ రోజున ఏ పార్టీలో ఉంటడో జనానికే కాదు వెంబడి తిరిగే క్యాడర్‌కు కూడా అర్థం అయితలేదు. లీడర్లు పార్టీ మారే ముందు ప్రెస్‌మీట్‌లు పెట్టి ప్రకటిస్తుంటారు. కొందరు రాజీనామా లేఖలు విడుదల చేస్తుంటరు. ఇంకొందరు విలేకరులకు లీక్‌లు ఇచ్చి వార్తలు రాయిస్తరు. అయితే, ఇవన్నీ పాత పద్ధతులు. ఇప్పుడు ట్రెండ్ మారింది. సోషల్ మీడియా జమానా నడుస్తున్నది. అందుకే, లీడర్లు కూడా కొత్త పద్ధతిని కనుగొన్నరు. పార్టీ మారేముందు వాట్సాప్, ఫేస్‌బుక్, ట్విట్టర్ వంటి వాటిల్లోని వాళ్ల సోషల్ మీడియా ఖాతాల డీపీ(డిస్‌ప్లే పిక్చర్) మారుస్తున్నరు. పాత పార్టీ కండువాతో ఉన్న డీపీలను మార్చి కండువాలు లేని ఫొటోలను డీపీగా పెట్టుకుంటున్నారు. ఇలా ఎవరైనా లీడర్ డీపీ మార్చిండంటే పార్టీ మారుతున్నడని సిగ్నల్ ఇచ్చినట్టు లెక్క. క్యాడర్ కూడా లీడర్ డీపీని చూసి 'అన్న పార్టీ మారుతున్నడని' ఫిక్స్ అయిపోవాలి. ఇంతకుముందు లీడర్లు పార్టీ మారితే.. కండువా మార్చిండని వార్తలు వచ్చేవి. ఇక ఫ్యూచర్‌లో 'డీపీ మార్చిన లీడర్' అని వార్తలు వస్తాయేమో మరి.

*- సందీప్ రెడ్డి*

■ ఇస్మాయిల్



## వెచ్చగుందిరా భై!

దివాకరం: ఎన్నికల కమిషన్‌కు ఎన్ని థ్యాంక్స్ చెప్పినా తక్కువేరా!
సుధాకరం: ఎందుకు రా!
దివాకరం: నవంబర్‌లో ఎన్నికలు పెట్టినందుకు.
సుధాకరం: అయితే ఏంటి?
దివాకరం: పొలిటికల్ హీట్‌తో చలి తుర్రుమని.. మస్తు వెచ్చగున్నది!!!

ప్రతి పథకం ఒక చరిత్ర.. ప్రతి అడుగు ఒక విప్లవం.. ప్రతి నిర్ణయం ఒక సంచలనం.. దేశం అసాధ్యం అనుకొన్న ప్రతి పనినీ తెలంగాణ ప్రభుత్వం తొమ్మిదేండ్లలో నిజం చేసి చూపించింది. ఒక దేశం, ఒక రాష్ట్రం అభివృద్ధికి ప్రధాన కొలమానాలనే అన్ని అంశాల్లోనూ ఇప్పుడు తెలంగాణదే అగ్రస్థానం. ఇది అంత ఆషామాషీగా ఏమీ రాలేదు. బీఆర్‌ఎస్ ప్రభుత్వ అవిరళ కృషి, మొక్కవోని సంకల్పానికి ఈ ప్రగతి నిదర్శనంగా నిలుస్తున్నది. దేశ ఆర్థిక ప్రగతికి చోదకశక్తిగా భావించే డజను కీలకాంశాల్లో తెలంగాణ సాధించిన ప్రగతి అద్భుతం. అన్ని రాష్ట్రాలకు అనుసరణీయం.



# బారాబర్ నెం. 1



### ఇదిరా.. తెలంగాణ మాడల్!

కడవేర్గు రాజశేఖర్
(స్పెషల్ టాస్క్ బ్యూరో)

సంపద సృష్టించడం, దాన్ని రెట్టింపు చేయడం ఎలాగో యావత్తు భారతావనికి తెలంగాణ బోధిస్తున్నది. ఒక రాష్ట్ర అభివృద్ధికి ప్రణాళికలను రూపొందించడం, వాటిని సమర్థంగా అమలు చేయడం చెప్పినంత తేలికకాదు. అయితే, సీఎం కేసీఆర్ మాత్రం కేవలం తొమ్మిదేండ్లలోనే అది చేసి చూపించారు. అందుకే ఆర్థిక వ్యవస్థకు, దేశాభివృద్ధికి కీలకంగా పరిగణించే జీఎస్డీపీ, తలసరి ఆదాయం, స్థాపిత విద్యుత్తు సామర్థ్యం, తలసరి విద్యుత్తు వినియోగం, వ్యవసాయానికి సాగునీరు, పంటల సాగు విస్తీర్ణం, ధాన్యం ఉత్పత్తి, ప్రాజెక్టుల్లో నీటి నిల్వ, ఐటీ ఉద్యోగాల కల్పన, ఐటీ ఎగుమతులు, వైద్య విద్య కాలేజీలు-సీట్లు, గురుకుల పాఠశాలల ఏర్పాటు ఇలా అన్నింట్లో 100 నుంచి 400 శాతానికి పైగా వృద్ధిరేటును నమోదు చేసింది. సీఎం కేసీఆర్ విజన్‌తో 12 రంగాల్లో దేశానికే దిక్సూచిలా మారింది.

- అభివృద్ధికి అర్థం మార్చిన తెలంగాణ
- ఆర్థిక ప్రగతికి కీలకమైన డజనుకు పైగా అంశాల్లో అభివృద్ధి పరుగులు
- 9 ఏండ్లలో మూడు రెట్ల అభివృద్ధి
- జీఎస్డీపీ, తలసరి ఆదాయం, విద్యుత్తు, వ్యవసాయం, ఐటీల్లో దేశానికే సాటి
- పంటల సాగు విస్తీర్ణం, ధాన్యం ఉత్పత్తి, మెడికల్ కాలేజీలు, సీట్లు, గురుకులాల ఏర్పాటు ఇలా అన్నింటా రికార్డే
- సీఎం కేసీఆర్ విజన్‌తో 12 రంగాల్లో దేశానికే దిక్సూచిలా తెలంగాణ

## దేశానికే తల'సిరి'

1 తలసరి ఆదాయ వృద్ధిలో తెలంగాణ దేశంలోనే అగ్రస్థానంలో ఉన్నది. 2013-14లో తెలంగాణ తలసరి ఆదాయం రూ. 93,151గా ఉంటే, ప్రస్తుతం అది రూ. 3,12,398కి చేరింది. దేశ సగటు తలసరి ఆదాయం రూ. 1,72,000 కంటే తెలంగాణ తలసరి ఆదాయం రూ. 1,40,398 ఎక్కువ.

## జీఎస్డీపీ జిగేల్

2 ఒక రాష్ట్ర ప్రగతికి జీఎస్డీపీనే ప్రామాణికం. దేశ జనాభాలో 2.9% వాటా మాత్రమే కలిగిన తెలంగాణ.. దేశ జీడీపీలో 4.9% వాటాను కలిగి ఉన్నది. 2013-14లో తెలంగాణ జీఎస్డీపీ రూ.3.78 లక్షల కోట్లుగా ఉంటే, 2023 నాటికి రూ.13.28 లక్షల కోట్లకు చేరింది. అంటే 9 ఏండ్లలో జీఎస్డీపీ మూడున్నరరెట్లు పెరిగింది.

బిగ్ స్టోరీ

## ఐటీ ఎగుమతుల్లో పైపైకి

3 తొమ్మిదేండ్ల బీఆర్‌ఎస్ పాలనలో ఐటీ ఎగుమతులు మూడు రెట్లు పెరిగాయి. 2014లో రూ. 66,276 కోట్లు ఉన్న ఐటీ ఎగుమతులు.. 2023 నాటికి రూ. 2,41,275 కోట్లకు ఎగబాకింది. 264 శాతం పెరుగుదలతో ఐటీ ఎగుమతుల్లోనూ ఏ రాష్ట్రమూ తెలంగాణకు సాటిరాదని నిరూపించింది.







## ఐటీ ఉద్యోగాల్లో మేటి

5 తెలంగాణ వచ్చాక రాష్ట్రంలో ఐటీరంగం ముఖచిత్రమే మారిపోయింది. ప్రభుత్వ సమర్థ కార్యాచరణతో ఐటీ ఉద్యోగావకాశాలు 243 శాతం వృద్ధిచెందాయి. 2014లో ఐటీ ఉద్యోగుల సంఖ్య 3,71,774గా ఉంటే 2023 వరకు 9,05,715కు అంటే మూడు రెట్లు పెరిగింది.

## సాగు విస్తీర్ణం రెట్టింపు

4 తెలంగాణ ఏర్పాటు తర్వాత సీఎం కేసీఆర్ సాగునీటి గోస తీర్చడంపై దృష్టి సారించారు. దీంతో 2014-15లో యాసంగి, వానకాలం కలిపి 1.31 కోట్ల ఎకరాలుగా ఉన్న సాగు విస్తీర్ణం, 2022-23లో 2.3 కోట్ల ఎకరాలకు పెరిగింది.



## మెడికల్ కాలేజీలు 5 రెట్లు

6 తెలంగాణ ఏర్పడే నాటికి 5 ప్రభుత్వ మెడికల్ కాలేజీలు మాత్రమే ఉండేవి. దీంతో సీఎం కేసీఆర్ జిల్లాకు ఒక మెడికల్ కాలేజీ ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. మొత్తంగా తొమ్మిదేండ్లలో 21 మెడికల్ కాలేజీల ప్రారంభంతో వీటి సంఖ్య 26కు చేరింది.



## ఏడాదికి 10 వేల మంది ఎంబీబీఎస్‌లు

7 ప్రభుత్వ, ప్రైవేటు కలిపితే 2014కు ముందు తెలంగాణలో 20 మెడికల్ కాలేజీలు, 2,850 సీట్లు మాత్రమే ఉండేవి. ఈ ఏడాది ఆ సంఖ్య 56కు పెరిగింది. సీట్ల సంఖ్య 8,340కి చేరింది. వచ్చే ఏడాది రానున్న సీట్లు కలుపుకొంటే తెలంగాణ నుంచి ఏడాదికి సగటున 10 వేల మంది డాక్టర్లు తయారు కానున్నారు.

## సాగునీరు పుష్కలం.. ఎవుసం సంబురం

8 తొమ్మిదేండ్ల కేసీఆర్ పాలనలో తెలంగాణ జలమాగాణం అయ్యింది. 2014 వరకు కేవలం 62 లక్షల ఎకరాలకు మాత్రమే సాగునీరు అందగా.. 126 శాతం పెరుగుదలతో 2023 నాటికి 1.4 కోట్ల ఎకరాలకు నీళ్లందిస్తున్న రాష్ట్రంగా రికార్డు సృష్టించింది.



## అంధకారం నుంచి వెలుగు జిలుగులు

9 ప్రత్యేక రాష్ట్రం వచ్చిన ఆరంటే ఆరు నెలల్లోనే గృహ, వాణిజ్య, పారిశ్రామిక రంగాలకు 24 గంటల నిరంతరాయ నాణ్యమైన విద్యుత్తును అందించి దేశమే ఆశ్చర్యపోయేలా చేసింది కేసీఆర్ సర్కారు. 2014లో 1,196 యూనిట్లుగా ఉన్న తలసరి విద్యుత్తు వినియోగం 2023 నాటికి 2,166 యూనిట్లకు చేరింది.

## ఆదర్శ గురుకులాలు


10 తెలంగాణ రాష్ట్రం అమలు చేస్తున్న గురుకుల విద్య ఇప్పుడు దేశానికే రోల్‌మాడల్‌గా మారింది. ఉన్నతవిద్యలో తెలంగాణలో పనితీరు మెరుగ్గా ఉన్నది. 2014లో కేవలం 298 గురుకులాలు మాత్రమే ఉండగా.. 2023 నాటికి ఆ సంఖ్య 1,002కు చేరుకొన్నది.



## తెలంగాణ దేశానికే బువ్వగిన్నె

11 తినడానికి సరిపడా పంట పండితే చాలు అనుకొన్న తెలంగాణ.. ఇప్పుడు దేశానికి అన్నంపెట్టే స్థాయిలో ధాన్యాన్ని ఉత్పత్తి చేస్తున్నది. 2014లో రాష్ట్రంలో 68 లక్షల టన్నుల ధాన్యం ఉత్పత్తి కాగా ప్రస్తుతం ఇది 2.6 కోట్ల టన్నులకు చేరింది. దేశవ్యాప్తంగా చూస్తే రాష్ట్ర వాటా 14 శాతానికి చేరింది.





## స్థాపిత విద్యుత్తు సామర్థ్యం డబుల్

12 తెలంగాణ ఏర్పడినప్పుడు రాష్ట్ర స్థాపిత విద్యుత్తు సామర్థ్యం 7,778 మెగావాట్లు మాత్రమే. గడిచిన తొమ్మిదేండ్లలో 141 శాతం పెరిగి 18,756 మెగావాట్లకు చేరింది. తొమ్మిదిన్నరేండ్లలో రెట్టింపు కన్నా ఎక్కువ స్థాపిత విద్యుత్తు సామర్థ్యంతో దేశానికే వెలుగుదివ్వెలా మారింది.